క్లుప్తంగా

ప్రోత్సాహకాలకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలను రాయల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యాన అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ నేషనల్ చైర్మన్ సుంకర కృష్ణ తెలిపారు. మాచవరంలో గురువారం రాయల్ సర్వీస్ సొసైటీ కార్యవర్గం సమావేశం ట్రస్ట్ అధ్యక్షులు పేటేటి పుల్లయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా మాదిరిగానే ప్రతిభావంతులైన పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయాలని తీర్మానం చేశామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన 90శాతానికిపైగా మార్కులు సాధించిన ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులు స్కాలర్‌షిప్‌కు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తుల చేసుకోవాలన్నారు. ఉచిత దరఖాస్తు కోసం ట్రస్ట్ కార్యదర్శి గుండపు చంద్రశేఖర్ 9246471029, కోశాధికారి గాజుల రామారావు 9985846122 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

యోగాసన పోటీల్లో జ్యోత్స్నదేవి ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు):కృష్ణా జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన యోగాసన పోటీల్లో తమ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న గంటా జోత్స్నదేవి ప్రతిభ చూపి మహిళల విభాగంలో కృష్ణా జిల్లా (ఉమ్మడి కృష్ణా జిల్లా) స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకుందని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ అన్నారు. జోత్స్నదేవిని గురువారం కళాశాలలో అభినందించారు. ఈ నెల 9, 10 తేదిల్లో కర్నూలులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు ఆమె అర్హత సాధించడం ఆనందంగా ఉందన్నారు. యోగా శిక్షకురాలు శిరీష, సహాయ శిక్షకుడు సాయి చెన్నకేశవతో పాటుగా అధ్యాపకులు ఆమెను అభినందించారు.

బీసీలను బానిసలుగా మార్చిన చంద్రబాబు

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ మండిపాటు

సాక్షి, అమరావతి: బీసీ ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు తన పాలనలో బీసీలను బానిసలుగా మార్చాడని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు ఎస్.మారేష్ మండిపడ్డారు. విజయవాడలోని బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో పలు కుల సంఘాల నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మారేష్ మాట్లాడారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో «బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ» అంటూ బోగస్ ప్రచారంతో బీసీలను మరోసారి మోసగించడానికి చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. రాజ్యసభ సీట్లను రూ.వందల కోట్లకు అమ్ముకున్న చరిత్ర చంద్రబాబుదని ఆరోపించారు. అదే రాజ్యసభ సీట్లను నలుగురు బీసీలకు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి మండలి వరకు రాజ్యాధికారంలో 65శాతం పైగా వాటా కల్పించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. చంద్రబాబు ఎన్ని ఎత్తులు వేసినా బీసీలంతా సీఎం వైఎస్ జగన్ వెంటే ఉంటారని మారేష్ స్పష్టం చేశారు.

నేటి నుంచి దర్గా ఉరుసు



భవానీపురం(విజయవాడ పశ్చిమ):స్వాతి సెంటర్‌లోని బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ చిష్టి ఔలియా దర్గా 39వ ఉరుసు (గంధం) మహోత్సవం ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఖాజీ, దర్గా ముతవల్లి/అధ్యక్షుడు సయ్యద్ షా మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ చిష్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పర్చం ఖుషాయ్ (ఉరుసు ప్రారంభోత్సవం) జరుగుతుందని పేర్కొన్నారు. రెండవ రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు బాబా దర్గా నుంచి గంధంతో వాహనంలో ఊరేగింపుగా బయలుదేరి ప్రకాశం బ్యారేజి, కాళేశ్వరరావు మార్కెట్ మీదుగా వించిపేటలో బాబా దేవుని ధ్యానం చేసిన ప్రదేశానికి (రైల్వే స్టేషన్ పడమర వైపు గల షాజహూర్ ముసాఫిర్ ఖానాలోని షాప్ నెంబర్ 9) వద్దకు చేరుకుంటుందని వివరించారు. తిరిగి అక్కడి నుంచి బయలుదేరి సొరంగం మీదుగా రాత్రి 9 గంటలకు భవానీపురం బాబా దర్గాకు చేరుకుంటుందని తెలిపారు. అనంతరం సంధల్(గంధం)ను బాబా దర్బార్‌పైకి ఎక్కిస్తామని పేర్కొన్నారు. చివరి రోజు ఆదివారం చిరాగ (దీపారాధన), సాయంత్రం 6.45 గంటలకు ఫాతెహాఖానీ జరుగుతుందని అన్నారు. రాత్రి 9 గంటలకు బాబాను కీర్తిస్తూ భక్తి గీతాలతో కూడిన ఖవ్వాలీ ప్రోగ్రామ్ ఉంటుందన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సింగ్‌నగర్‌లో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):నగరంలోని ముత్యాలంపాడు, మధురానగర్ , మాచవరం, గులాబీతోట తదితర ప్రాంతాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు వైష్ణవాలయాలను దర్శించి స్వామి వారికి అభిషేకాలు, పంచామృతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల ఫలాలు, అటుకులు, వెన్న, పెరుగు, మీగడను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నికృష్ణులు, గోపికల వేషధారణ ఆకట్టుకున్నాయి. ఆయా వేడుకల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి అన్నదానాలను ప్రారంభించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలకు కృష్ణాష్టమి ప్రతీక అన్నారు. భగవద్గీత ప్రబోధకుడిగా, రాజనీతిజ్ఞుడిగా కృష్ణుడి జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ముత్యాలంపాడు రావిచెట్టు సెంటర్‌లో శ్రీ కృష్ణ సేవాసమితి యాదవ సంఘం ఆధ్వర్యాన భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 5వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్పొరేటర్ పెనుమత్స శిరీష,



సర్వాలంకార భూషితుడైన శ్రీ కృష్ణ పరమాత్ముడు

డివిజన్ అధ్యక్షులు పెనుమత్స సత్యం, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. మాచవరం శ్రీకృష్ణ మందిరంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల నాగేశ్వరరావు, గొల్లభామ పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణ జయంతి సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయ నిర్వాహకులు భక్తుల కోసం గురువారం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దుర్గాపురంలోని శివరామక్షేత్ర సముదాయంలోని శ్రీ కృష్ణమందిరంలో ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పర్యవేక్షణలో శ్రీ కృష్ణ జయంతిని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ కృష్ణకు పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ, నమక, చమక సహిత పూజలు జరిపించారు. పున్నమ్మతోట తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించే శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చక స్వాములు శ్రీ కృష్ణజయంతిని నిర్వహించారు. గోపూజ, శ్రీ వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):సింగ్‌నగర్, వాంబేకాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట పరిసర ప్రాంతాల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా విచ్చేసి శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. సింగ్‌నగర్ 58వ డివిజన్‌లోని కృష్ణాహోటల్ సెంటర్‌లో మాధవ కృష్ణ యాదవ రాజుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి వెంకట్రావ్, సంక్షేమ సంఘం అధ్యక్షులు మరకా శ్రీను, మాగంటి శ్రీనివాస్, వీర్ల సత్యనారాయణ, కొలుసు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. 60వ డివిజన్ వాంబేకాలనీలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రజలకు అనేక సేవలను అందిస్తున్న జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు పొదిగింటి నాగరాజును సన్మానించారు. నాయకులు బెవర నారాయణ, బత్తుల దుర్గారావు, ఆ సంఘం సభ్యులు ఎస్.రాము, ఆర్.గోవిందు, పి.సతీష్, కె.కృష్ణ, జి.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

విలేజి కండ్రికలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని యాదవుల బజార్లో గురువారం జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, యరగొర్ల శ్రీరాములు, షేక్.ఇస్మాయిల్, త్రినాథ్, స్థానికులు పెద్ద సంఖ్యలో పూజలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం ఉట్టిగొట్టే కార్యక్రమం నిర్వహించారు.

రచయిత్రి వసుధారాణి అభినందనీయురాలు

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలుగు భాష, సాహిత్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్న రచయిత్రి రూపెనగుంట్ల వసుధారాణి అభినందనీయురాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వసుధారాణిని కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వేటపాలేనికి చెందిన వసుధరాణి రచించిన కేవలం నువ్వే, దేవ కాంచనం నీడన, పది వెంట నేను అనే పుస్తకాలు ప్రముఖంగా నిలిచాయన్నారు. తెలుగు భాషా, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ కె. మోహన్ కుమార్ పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధికి బోర్డు ఏర్పాటు అభినందనీయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): సంచార జాతుల ఆర్థిక అభివృద్ధి, వారి సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం బోర్డు, పాలక మండలి ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా మేదర సంఘం జి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ బోర్డు ఏర్పాటుతో సంచార జాతుల ఆర్థికంగా ఎదిగేందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

మధురానగర్ సర్వతోముఖాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయిన మధురానగర్ సర్వతోముఖాభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ 207 వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి నగర పాలక సంస్థ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం నడుస్తుందని చెప్పారు. గడప గడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

మధురానగర్ ముఖచిత్రంలో పెనుమార్పు..

మధురానగర్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా ఈ ప్రాంతమంతా సిమెంట్ రోడ్లు వేయించినట్లు పేర్కొన్నారు. సీసీ రహదారులు, యూజీడీ,



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

వంతెనల నిర్మాణంతో మధురానగర్ ముఖచిత్రమే మారిపోయిందన్నారు. కానీ టీడీపీ హయాంలో ఈ ప్రాంతం పూర్తి నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు. మధురానగర్ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. గత పాలకుల బాధ్యతారాహిత్యం ఈ ప్రాంత ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. మరలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రాంతం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్‌సీపీ నగర మహిళ అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, నాయకులు కంభం కొండలరావు, కోలా రమేష్, అక్బర్, శనగశెట్టి హరిబాబు, గోవింద్, సుధాకర్, పూర్ణిమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9న ఎన్వీ రావుకు సత్కారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):దేశంలోని రైతులపై పీహెచ్‌డీ చేసిన బీసీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎన్వీ రావును 9వ తేదీన ఘనంగా సత్కరించనున్నామని పలువురు బీసీ నేతలు పేర్కొన్నారు. కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సత్కార విశేషాలను బీసీ నేతలు వివరించారు. బీసీ నాయకులు నమ్మి అప్పారావు, నగరాల సంఘం ప్రతినిధి బాయన శేఖర్‌బాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధి శివకుమార్ పట్నాయక్‌లు మాట్లాడుతూ బీసీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎన్వీరావు నాగార్జున యూనివర్సిటీలో రైతుల గురించి పీహెచ్‌డీ చేయడంతో ఆయన డాక్టరేట్ అందచేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎన్వీ రావును బీసీ సంఘాల తరుపున ఘనంగా సత్కరిస్తున్నామన్నారు. 9వ తేదీ కేటీ రోడ్డులోని ఎన్వీ కన్వెన్షన్‌లో నిర్వహించే కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేయనున్నారన్నారు. బీసీ నేతలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులందరూ తప్పని సరిగా సన్మాన కార్యక్రమానికి విచ్చేయాలని కోరుతున్నామన్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ప్రకృతి పరిరక్షణ కోసం అందరూ పాటుపడాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో నీలి ఆకాశం కోసం అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం సందర్భంగా «స్వచ్ఛమైన గాలి కోసం అందరం» అంశంపై సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న సాంకేతిక ప్రగతి పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. ప్రకృతిలో కీలకమైన గాలి నాణ్యత రోజురోజుకు దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం పెరుగుతుండటంతో మానవుల ఊపిరితిత్తుల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కేవలం మానవులకే కాకుండా సమస్త జీవరాశి గాలికాలుష్యంతో ప్రమాదంలో పడిందన్నారు. వాయు కాలుష్యాన్ని వీలైనంత వరకూ తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మారుతున్న కాలానుగుణంగా వస్తున్న పరిస్థితులను విద్యార్థులు గమనిస్తూ ప్రకృతిలో జరిగే కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలని సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ రీజనల్ ఆఫీసర్ ఎస్. విజయసారథి మాట్లాడుతూ విద్యార్థులు కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలని సూచించారు. ముఖ్యంగా కాలుష్య నివారణకు సంబంధించి నూతన ఆవిష్కరణలు తీసుకురావాలన్నారు. కార్యక్రమానికి కళాశాల డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. విభాగాధిపతి సీహెచ్ నాగభూషణం, అధ్యాపకులు ఆర్.ఉదయ్‌కుమార్, ఏహెచ్‌డీ ప్రకాష్, జి.హేమలత పాల్గొన్నారు.

దుర్గగుడిపై యాగశాలకు శంకుస్థాపన



యాగశాల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ



ధ్వజస్తంభ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్, ఈవోలతో పాటు దేవినేని అవినాష్ దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో నూతన యాగశాల, మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు పనులకు గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతన యాగశాలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ శంకుస్థాపన చేసి, పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దంపతులు హాజరయ్యారు. అంతకు ముందు చైర్మన్, ఈవోలతో పాటు పాలక మండలి సభ్యులు మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం చేపట్టిన పనులు దిగ్విజయంగా పూర్తి కావాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో డీఈవో గురు ప్రసాద్, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాసరావు, నంబూరి రవి, చింతా సింహచలం, బచ్చు మాధవీకృష్ణ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమతో పాటు యాగశాల నిర్మాణదాత నరసింహారావు, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దాతల నిర్మాణ సహకారంతో ఆయా పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.

దసరా అలంకారాలపై చైర్మన్‌తో చర్చ

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి చేసే విశేష అలంకారాలపై దుర్గగుడి ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు శంకరశాండిల్యాలు గురువారం చైర్మన్ కర్నాటి రాంబాబు చర్చించారు. ఈ ఏడాది అధిక శ్రావణం, తిథుల హెచ్చుతగ్గుల కారణంగా అలంకరణలలో చోటు చేసుకున్న మార్పుల గురించి చర్చించారు. సుమారు అరగంటకు పైగా సాగిన ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో తొలి రోజున స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి అలంకారం చేయకపోవడానికి గల కారణాలను వైదిక కమిటీ, ఈవోలను చైర్మన్ రాంబాబు అడిగి తెలుసుకున్నారు.

డిసెంబర్ నాటికి ఆర్‌యూబీ పనులు పూర్తిచేస్తాం



మధురానగర్ ఆర్‌యూబీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మధురానగర్ ఆర్‌యూబీ పనులను డిసెంబర్ నాటికి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆర్‌యూబీ పనులను గురువారం ఆయన కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కారణంగా అండర్ బ్రిడ్జి పనుల్లో కొంత జాప్యం జరిగిందని తెలిపారు. డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పనులు చేపడతామని చెప్పారు. ఈలోగా సాయిబాబా కాలనీ వాసులకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా.. ఒక మినీ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు బందెల దయానందం వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన సినీ, భక్తి సంగీత విభావరి



భక్తి గీతాలను బృందగానం చేస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: శ్రీసాయిలాహరి లాహిరిలో సరిగమల సప్త స్వరాలు సంస్థ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సీనియర్ గాయకుడు కేవీ రమణబాబు ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సినీ, భక్తి సంగీత విభావరి మధురంగా సాగింది. గాయనీ గాయకులు రసూల్‌బాబు, ఆదిరాల జయప్రభ, కృష్ణకుమారి, సువర్ణలక్ష్మి, శివనాగలక్ష్మి,పావని, పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. శ్రీసాయి లాహిరి, లాహిరిలో సరిగమల సప్తస్వరాలు సంస్థ వ్యవస్థాపకుడు కేవీ రమణబాబు మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కళాపోషకుడు ఎం.రమణారావు, డేవిడ్‌రాజు గాయనీ గాయకులను అభినందించారు. కృష్ణసింధు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎంకే బేగ్ స్కూల్ విద్యార్థినికి మొదటి బహుమతి



రోషన్ ఆరా, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న హెచ్‌ఎం ఇమామ్‌బాషా, టీచర్లు

అజిత్‌సింగ్‌నగర్,(విజయవాడసెంట్రల్):నాల్గవ అంతర్జాతీయ స్వచ్ఛ మైన గాలి, నీలి ఆకాశం సందర్భంగా విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు జరిగిన సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో 59 డివిజన్ ఎంకే బేగ్ మునిసిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థిని షేక్ రోషన్ ఆరా ప్రథమ బహుమతిని గెలుచుకుంది. గురువారం ఉదయం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం దగ్గర జరిగిన ఈ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేషన్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా రోషన్ ఆరా దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను, వెయ్యి రూపాయల నగదు బహుమతిని అందుకుంది. పాఠశాల అసెంబ్లీలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎమ్ఎస్ ఇమామ్ బాషా, ఇతర ఉపాధ్యాయులు సైన్స్ ప్రాజెక్ట్ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని రోషన్‌ను, వారి తల్లదండ్రులైన షేక్ రబ్బానీ, అజీజా బేగంలను సన్మానించారు. పాఠశాల టీచర్లు టి.హేమలత, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పూజలు జరిపించుకున్న రవీంద్రనాథ్‌కు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందచేయగా, అధికారులు ప్రసాదాలు అందించారు.

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం ప్రత్యేక

ముగిసిన ఎల్‌ఐసీ వారోత్సవాలు



పోటీల్లో విజేతలైన చిన్నారులతో ఎల్‌ఐసీ అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి నిర్వహించిన వారోత్సవాలు గురువారం ముగిసాయి. బెంజిసర్కిల్ సమీపంలోని ఎల్‌ఐసీ బ్రాంచి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పాలసీదారుల సమావేశం, పాలసీదారుల సర్వీసు క్యాంపు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యాలయ సిబ్బందికి, ఏజెంట్లకు వేర్వేరుగా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జి.కృపాచారి చేతుల మీదగా బహుమతులు అందజేశారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ సి. రామకృష్ణ మాట్లాడుతూ ఎల్‌ఐసీ సేవలు, పాలసీల గురించి ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, ఏజెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

రేపటి వరకు బకాయిల చెల్లింపునకు అవకాశం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ కోర్టుల్లో ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే నేషనల్ లోక్ అదాలత్‌లో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ బకాయిలు చెల్లించేందుకు అవకాశం ఉందని సంస్థ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. క్లోజ్ చేసిన బీఎస్ఎన్ఎల్ బ్రాడ్ బ్యాండ్, హెచ్‌టీటీఎఫ్, మొబైల్ పోస్ట్‌పెయిడ్ లీజ్డ్ సర్క్యూట్స్ తాలూకు వినియోగదారులకు ఇప్పటికే న్యాయ సేవాధికార సంస్థల ద్వారా నోటీసలు జారీ చేశా మని తెలిపారు. వినియోగదారులు ఈనెల 9వ తేదీ లోపు కోర్టుకు హాజరు కాకుండా ముందుగానే తమ బకాయిలను వడ్డీ లేకుండా చెల్లించుకోవచ్చని సూచించారు. బకాయిలు చెల్లించిన తరువాత సర్వీసులను పునరుద్ధరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్, కరెంట్ ఆఫీసు రోడ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయా డివిజన్లలో ఆయన పర్యటించారు.